## క్లుప్తంగా

### అరుణాచలేశ్వరస్వామిని దర్శించుకున్న కౌశిక్‌రెడ్డి



అరుణాచలేశ్వరస్వామి సన్నిధిలో ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి, కుటుంబ సభ్యులు

**హుజూరాబాద్:** తమిళనాడులోని అరుణాచలేశ్వరస్వామిని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి దంపతులు మంగళవారం దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ప్రజలందరూ సంతోషంగా ఉండాలని స్వామివారిని వేడుకున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.

### 'పట్టాభూమిపై అధికారులను తప్పుదోవ పట్టిస్తున్నారు'

**జమ్మికుంట:** మున్సిపల్ పరిధి ధర్మారం గ్రామ శివారులోని కుంట శిఖం సర్వేనంబర్ 368లో ప్రభుత్వ భూమి ఉండగా కొంత భూమిలో వ్యవసాయం చేసుకుంటున్నామని, ఆ భూమికి సంబంధించిన ఫైనల్ పట్టా సర్టిఫికెట్, పహణీ, భూమిశిస్తు రసీదులు నా భార్య గొడుగు ఈశ్వరమ్మ పేరు ఉన్నాయని బాధితుడు గొడుగు సారయ్య మంగళవారం తెలిపాడు. ఆధారాలు ఉన్నా కౌన్సిలర్ బొంగోని వీరన్న అధికారులను తప్పుదోవ పట్టిస్తున్నాడని పేర్కొన్నారు.

**కౌన్సిలర్ వివరణ ..**

ఇప్పటివరకు ఆ భూమిలో ఎవరూ సాగు చేయలేదనేది గ్రామంలో అందరికి తెలిసిన విషయం, ఆ భూమిని చదును చేసి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసేందుకు గొడుగు సారయ్య, మరికొంత మంది చూస్తున్నారని కౌన్సిలర్ బొంగోని వీరన్న తెలిపారు. కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామని, స్థానిక రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు విచారణ చేపట్టి కుంట హద్దులు చూపెడతామని అన్నారని వివరించారు.

### ఇంటి అనుమతికి రూ.30వేలు డిమాండ్

**శంకరపట్నం:** ఇంటి పర్మిషన్ కోసం కార్యదర్శి జ్యోతి రూ.30వేలు డిమాండ్ చేసిందని మండలంలోని లింగాపూర్ గ్రామానికి చెందిన కవ్వ రమ్య మంగళవారం అధికారులకు ఫిర్యాదు చేసింది. నూతన ఇంటి నిర్మాణానికి రమ్య, రాజిరెడ్డి దంపతులు గ్రామపంచాయతీ కార్యాలయంలో దరఖాస్తు పెట్టుకున్నారు. అనుమతి ఇవ్వకుండా కార్యదర్శి ఇబ్బందులకు గురిచేస్తోందని ఆరోపించారు. రూ.30 వేలు చెల్లించాలని కార్యదర్శి డిమాండ్ చేయగా రూ. 23 వేలు చెల్లించామని, ఇంటి వెనక రేకుల షెడ్డు వేసుకుంటామన్నందుకు కార్యదర్శి భర్త రమేశ్ బెదిరించాడని తెలిపారు. డబ్బులు తీసుకున్న కార్యదర్శి జ్యోతి, భర్త రమేశ్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, మండల సూపరింటెండెంట్ శ్రీధర్‌కు ఫిర్యాదు చేసినట్లు బాధితురాలు తెలిపింది.

### పచ్చిరొట్ట విత్తనాలు అందుబాటులో ఉంచాలి

**శంకరపట్నం:** నేల సారవంతం కోసం పచ్చిరొట్ట విత్తనాలను వ్యవసాయశాఖ రైతులకు అందుబాటులో ఉంచాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆరు వేల క్వింటాళ్ల జనుము, జీలుగ విత్తనాలు అవసరమని జిల్లా అధికారులు సూచిస్తే ఇప్పటివరకు 11 వందల క్వింటాళ్లు మాత్రమే సరఫరా చేశారని, ఫర్టిలైజర్ దుకాణాల్లో నాణ్యమైన విత్తనాలను మాత్రమే విక్రయించాలన్నారు. ఈసమావేశంలో రాజిరెడ్డి, వాసుదేవ్ తదితరులు పాల్గొన్నారు.

### బియ్యం అందజేత



బియ్యం అందజేస్తున్న నాయకులు

**గన్నేరువరం:** మండలంలోని హన్మాజిపల్లె గ్రామానికి చెందిన గుండి రాజయ్య ఇటీవల మృతి చెందగా ఆయన కుటుంబ సభ్యులను యువజన కాంగ్రెస్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి అల్లూరి శ్రీనాథ్‌రెడ్డి మంగళవారం పరామర్శించారు. యాభై కిలోల బియ్యం అందజేశారు. గ్రామశాఖ అధ్యక్షుడు సంజీవ్, ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు నాగరాజు, ఉపాధ్యక్షుడు శ్రీశైలం, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, ఎండీ రజాక్, వినోద్, శ్రీధర్‌రెడ్డి, గ్రామస్తులున్నారు.

### పవర్‌కట్ ప్రాంతాలు

**కొత్తపల్లి:** కరీంనగర్‌లో విద్యుత్ మరమ్మతు పనులు చేపడుతున్నందున బుధవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటలకు 11 కేవీ శివనగర్ ఫీడర్ పరిధిలోని రాంనగర్, మార్కండేయనగర్, ప్రగతినగర్, సప్తగిరికాలనీ, శివనగర్, టెలిఫోన్ క్వార్టర్స్, బతుకమ్మ కాలనీ, హస్నాపూర్ కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్-2 ఏడీఈ ఎం.సుధీర్ కుమార్ తెలిపారు.

# పనులు పూర్తయ్యేనా..?

- అమ్మ ఆదర్శ పాఠశాలల్లో కొనసాగుతున్న మరమ్మతులు
- వీవో అధ్యక్షురాలు, ప్రధానోపాధ్యాయుడి అకౌంట్లోకి డబ్బులు జమ
- ప్రతీరోజు పనుల పర్యవేక్షణ
- గ్రామైక్య సంఘాలకు బాధ్యతలు
- కొన్ని రోజుల్లో ప్రారంభంకానున్న పాఠశాలలు



వేగురుపల్లి ప్రాథమిక పాఠశాల భవనం పైకప్పు రిపేరు పనులు

**మానకొండూర్:** ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం మనఊరు మనబడి పథకంలో భాగంగా పలు పాఠశాలలను ఎంపిక చేసి నిధులు కేటాయించి ఆదర్శ పాఠశాలలుగా తీర్చిదిద్దింది. అయితే ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం మరికొన్ని ప్రభుత్వ పాఠశాలలను అమ్మ ఆదర్శ పాఠశాలలుగా ఎంపిక చేసి కనీస మౌలిక వసతులు కల్పించాలని నిధులు మంజూరు చేసింది. మరమ్మతు పనుల కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేయగా ఆయా గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో తాగునీరు, మరుగుదొడ్లు, మైనర్ రిపేర్స్ పనులు మొదలయ్యాయి. పనుల నిర్వహణ గ్రామైక్య సంఘాలకు అప్పగించగా కొంత మేర నిధులు పాఠశాల చైర్మన్‌గా వ్యవహరిస్తున్న వీవో అధ్యక్షురాలు, ప్రధానోపాధ్యాయుడి అకౌంట్లోకి జమ కాగా పనులపై అధికారులు పర్యవేక్షణ పెంచారు. జూన్ 5 లోపే పనులు పూర్తి చేయాలని ఆదేశాలు ఉన్నాయి. అయితే కొద్ది రోజుల్లో పాఠశాలల తాళం తెరుచుకోనున్నాయి. పాఠశాలలు ప్రారంభం అయ్యేనాటికి పనులు పూర్తవుతాయో లేదోనని పిల్లల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పనులు త్వరితగతిన పూర్తి చేయాలని పేరెంట్స్ డిమాండ్ చేస్తున్నారు.

**23 పాఠశాలలు ఎంపిక**

మండలంలో ఎంపిక చేసిన 23 అమ్మ ఆదర్శ ప్రభుత్వ పాఠశాలల్లో కనీస మౌలిక వసతుల కల్పనకు చేపట్టిన మరమ్మతు పనులు పూర్తి చేసేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. గతంలో మనఊరు మనబడి పథకం కింద ఎంపిక చేసిన బడుల్లో పనులు చేసిన కాంట్రాక్టర్లకు డబ్బులు రాకపోవడంతో చాలా ఇబ్బందులు పడ్డారు. ఇప్పుడు కూడా డబ్బులు వస్తాయో లేదోనని పనులు చేసేందుకు వెనుకంజ వేశారు. అయితే ఈసారి మాత్రం ప్రభుత్వం పనులు త్వరితగతిన పూర్తి చేసేందుకు వీవో, ప్రధానోపాధ్యాయుడి అకౌంట్లోకి 25 శాతం మేర డబ్బులు ఇప్పటికే జమ చేసింది. మిగితా 75 శాతం నిధులు పనులు పూర్తయ్యాక ఏఈ ఎంబీ రికార్డు పూర్తి చేసిన అనంతరం అందనున్నాయి. దీంతో పాఠశాలల్లో పనులు మొదలయ్యాయి.



మానకొండూర్‌లో విద్యుత్ మర్మమతు పనులు

తాగునీరు అందించేందుకు పైపులైన్, ట్యాంకులు, మరుగుదొడ్ల వద్ద నీటి సౌకర్యం, ఎలక్ట్రిషన్ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నా సమయానికి పూర్తవుతాయో లేదోనని అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

**ప్రతీరోజు పర్యవేక్షణ**

పాఠశాలలు తెరుచుకునే సమయానికి మరమ్మతు పనులు పూర్తి చేయాలని ప్రతీరోజు అధికారులు పనులను పర్యవేక్షిస్తున్నారు. స్పెషల్ ఆఫీసర్లు, ఎంపీడీవో, ఎంపీవో, ఏఈవోలు, కాంప్లెక్సు ఉపాధ్యాయులను భాగస్వామ్యం చేసి పనులను పర్యవేక్షిస్తూ ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఏ మేరకూ పనులు పూర్తి చేస్తారో చూడాలి.

### పనులు పూర్తవుతాయి...

మండలంలో ఎంపిక చేసిన అమ్మ ఆదర్శ పాఠశాలల్లో పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ప్రతి రోజు పనులను పర్యవేక్షిస్తున్నం. పాఠశాలలు ప్రారంభం అయ్యేనాటికి పనులు పూర్తవుతాయని భావిస్తున్నాం.

– మధుసూదనాచారి, ఎంఈవో

## ముగిసిన శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



హనుమాన్ మాలధారణ స్వాములకు అన్నదానం



హనుమాన్ విగ్రహానికి పూజలు చేస్తున్న భక్తులు

**చిగురుమామిడి:** మండలంలోని సుందరగిరి గ్రామంలో శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ముగిశాయి. ఈనెల 19వ తేదీ నుంచి 27వ తేదీ వరకు వారం రోజుల పాటు స్వామివారికి ప్రతి రోజు ఉదయం, సాయంత్రం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామప్రముఖులు, పోలీసులు, ఆలయ ఈఓ, క్లర్క్‌తో పాటు ప్రతి ఒక్కరి సహకారంతోనే బ్రహ్మోత్సవాలు సంపూర్ణంగా ముగిశాయని ఆలయ అర్చకులు, ధర్మకర్తల మండలి సభ్యులు తెలిపారు.

**అన్నదానం**

**హుజూరాబాద్:** హనుమాన్ పెద్ద జయంతిని పురస్కరించుకొని అంజన్న మాలధారణ స్వాములకు పట్టణంలో మంగళవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. జమ్మికుంట రోడ్‌లో అంజన్న భక్తులతో కలిసి ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వాములు హనుమాన్ చాలీసా పారాయణం చేశారు.

**హనుమాన్ పల్లకి సేవ**

**చొప్పదండి:** పట్టణంలో మంగళవారం హనుమాన్ పల్లకి సేవ నిర్వహించారు. స్థానిక భక్త అభయాంజనేయ స్వామి ఆలయంలో హనుమాన్ విగ్రహానికి అభిషేకాలు నిర్వహించిన అనంతరం పట్టణంలోని పురవీధుల గుండా పల్లకి సేవ కొనసాగింది. అనంతరం హనుమాన్ భక్తులకు భిక్ష కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో అర్చకులు జనగామ సత్యనారాయణ, హనుమాన్ మాలధారణ భక్తులు పాల్గొన్నారు. మండలంలోని రుక్మాపూర్‌లో హనుమాన్ భక్తులు హనుమాన్ చిత్రపటంతో ఊరేగింపు నిర్వహించారు. స్థానిక భక్తులు పాల్గొన్నారు.

## గడువులోపు పనులు పూర్తి చేయాలి



బొమ్మనపల్లి ప్రభుత్వ పాఠశాలలో పనులను పరిశీలిస్తున్న డీఈఓ జనార్దన్‌రావు

**చిగురుమామిడి:** అమ్మ ఆదర్శ పాఠశాలల్లో నిర్వహిస్తున్న పనులను గడువులోపు పూర్తి చేయాలని జిల్లా విద్యాధికారి సీహెచ్ జనార్దన్‌రావు అన్నారు. బొమ్మనపల్లి, కొండాపూర్, సుందరగిరి పాఠశాలలను మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'అమ్మ ఆదర్శ' పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా అభివృద్ధి చేయాలన్నదే ప్రధాన లక్ష్యమన్నారు. ప్రభుత్వ లక్ష్యసాధనకు అనుగుణంగా కాంట్రాక్టర్లు నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ గడువులోపు పూర్తి చేయాలని ఆదేశించారు. డీఈఓ వెంట ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి, స్కూల్ కాంప్లెక్ హెచ్ఎంలు పావని, లక్ష్మణ్‌రావు, టీచర్లు రవి, గంప చంద్రశేఖర్, కిషన్‌నాయక్ ఉన్నారు.

## ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన



మాట్లాడుతున్న శాస్త్రవేత్త వెంకటేశ్వర్‌రావు

**జమ్మికుంట:** పట్టణంలోని కేవీకేలో లోహియ ఎడిబుల్ ఆయిల్ కంపెనీ, కేవీకే ఆధ్వర్యంలో మంగళవారం ఆయిల్‌పామ్ సాగు, లాభాలు, మార్కెటింగ్ విధానంపై రైతులకు అవగాహన, శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కేవీకే హెడ్, సీనియర్ శాస్త్రవేత్త వెంకటేశ్వరరావు, జిల్లా ఉద్యాన అధికారి బండారు శ్రీనివాస్ మాట్లాడారు. ఆయిల్‌పామ్ సాగుతోపాటు అంతర పంటల వల్ల లాభాలు ఉంటాయని, ప్రభుత్వం సబ్సిడీ అందిస్తుందని తెలిపారు. ఇతర దేశాల్లో ఆయిల్‌పామ్ సాగు, తోటలు, పంట తీసే విధానం వివరించారు. కార్యక్రమంలో లోహియా ఎడిబుల్ ఆయిల్ కంపెనీ అధినేత సిద్దాంథ్ లోహియా, అధికారులు, కేవీకే శాస్త్రవేత్తలు, రైతులు పాల్గొన్నారు.

## నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు



విత్తన డీలర్లతో మాట్లాడుతున్న ఏఓ రంజిత్‌రెడ్డి



చొప్పదండి: మాట్లాడుతున్న ఏవో వంశీకృష్ణ

**చిగురుమామిడి:** రైతులకు గడువు ముగిసిన, నకిలీ విత్తనాలు అమ్మితే విత్తన డీలర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని ఏఓ రంజిత్‌రెడ్డి, ఎస్సై బి. రాజేశ్ హెచ్చరించారు. మంగళవారం చిగురుమామిడిలోని రైతువేదికలో మండలంలోని విత్తన డీలర్లతో అవగాహన సమావేశం నిర్వహించారు. ఏ గ్రామంలోనైనా లూజు పత్తి విత్తనాలు విక్రయిస్తే సమాచారం అందించాలని కోరారు. కొనుగోలు చేసిన రైతులకు తప్పని సరి రశీదులు ఇవ్వాలన్నారు. డీలర్లు నిబంధనలు అతిక్రమిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేయడమేగాకుండా లైసెన్స్ రద్దు చేస్తామన్నారు. మండలంలోని కొండాపూర్ గ్రామంలో రైతులకు ఖరీఫ్ పంటల సాగుపై ఏఈఓ సాయికుమార్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామప్రత్యేకాధికారి శ్రీధర్, పంచాయతీకార్యదర్శి గున్నాల రాంకీ పాల్గొన్నారు.

**విత్తనాల బిల్లులు భద్రపరుచుకోవాలి**

**చొప్పదండి:** లైసెన్స్‌డ్ డీలర్ల వద్దే రైతులు విత్తనాలు కొనుగోలు చేయాలని, విత్తనాల బిల్లులు పంట కాలం పూర్తయ్యే వరకు భద్రపరుచుకోవాలని మండల వ్యవసాయాధికారి వంశీకృష్ణ కోరారు. కొలిమికుంట, ఆర్నకొండ, కాట్నపల్లి, చాకుంట, చిట్యాలపల్లి గ్రామాల్లో మంగళవారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. లూజు విత్తనాలు కొనుగోలు చేయొద్దని సూచించారు. విత్తనాల ప్రక్రియ నుంచే జాగ్రత్తగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమాలలో వ్యవసాయ విస్తరణ అధికారులు పాల్గొన్నారు.

### ఆర్టీసీ డ్రైవర్‌పై యువకుల దాడి

**శంకరపట్నం:** మండలంలోని తాడికల్ గ్రామంలో మంగళవారం ఆర్టీసీ డ్రైవర్‌పై గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు చేయిచేసుకున్నారు. హన్మకొండ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు నిజామాబాద్ నుంచి ప్రయాణికులతో హన్మకొండకు వెళ్తోంది. తాడికల్ వద్దకు రాగానే బస్సు మీదికి వస్తోందని గాలిపెల్లి అనిల్ మరో యువకుడితో కలిసి బస్సును ఆపేశారు. డ్రైవర్‌ను కొట్టడంతో ప్రయాణికులతోపాటు డ్రైవర్ విజేందర్ అనిల్‌ను బంధించి కేశవపట్నం పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. మరోయువకుడు తప్పించుకోగా డ్రైవర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై లక్ష్మారెడ్డి తెలిపారు.

### ఆరోగ్యంపై గ్రామసభలు

**శంకరపట్నం:** మహిళల ఆరోగ్యంపై మంగళవారం వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక గ్రామసభలు నిర్వహించారు. మండలంలోని కేశవపట్నం, తాడికల్, కొత్తగట్టు తదితర గ్రామాలలో ఉపాధిహామీ పనులు చేస్తున్న ప్రాంతంలో కూలీలకు ఏఎన్ఎంలు, సూపర్ వైజర్లు ఆరోగ్యంపై పలు సూచనలు చేశారు. మహిళలకు ఆరోగ్య భద్రతపై అవగాహన కల్పించారు.

### ఇంటర్ వాల్యుయేషన్ తప్పులపై విచారణ జరపాలి

**కరీంనగర్:** ఇంటర్ ప్రశ్నాపత్రాల వాల్యుయేషన్ తప్పులపై విచారణ జరిపించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రామారపు వెంకటేశ్, మచ్చ రమేశ్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఇంటర్ బోర్డు అధికారుల నిర్లక్ష్యం, ఇంటర్ ప్రశ్నాపత్రాల వాల్యూయేషన్ చేసిన వారు అలసత్వం వహించి తప్పులుగా దిద్దడం వల్ల వేలాది మంది విద్యార్థులకు నష్టం వాటిల్లిందని అన్నారు. మెరిట్ స్టూడెంట్‌కు మొదటి సంవత్సరంలో వచ్చిన మార్కులు రెండో సంవత్సరంలో వచ్చిన మార్కులు చూస్తే చాలా విచిత్రంగా ఉందని, విద్యార్థులు తమకు ఏ సబ్జెక్ట్‌లో ఎన్ని మార్కులు వస్తాయో ముందే పరీక్ష రాశాక ఊహించుకుంటారని, ఫలితాల అనంతరం మార్కులు చూసి షాక్‌కు గురయ్యారని తెలిపారు. వేలాది సంఖ్యలో విద్యార్థులు ప్రశ్నాపత్రాల తప్పుడు వాల్యుయేషన్ వల్ల ఇబ్బందులు పడుతున్న ఇంటర్ బోర్డు ఇప్పటివరకు ఒక స్పష్టమైన భరోసా ఇవ్వలేదని, తప్పుడు వాల్యూయేషన్ వల్ల నష్టపోయిన విద్యార్థులందరికీ వెంటనే ఇంటర్ బోర్డు న్యాయం చేయాలని అన్నారు. లేని పక్షంలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఇంటర్మీడియట్ బోర్డు ముట్టడిస్తామని హెచ్చరించారు.

## సావర్కర్‌కు నివాళి



సావర్కర్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

**రామడుగు:** మండలంలోని గోపాల్‌రావుపేట జాతీయ జెండా ప్రధాన చౌరస్తా వద్ద మంగళవారం వినాయక్ దామోదర్ (వీర) సావర్కర్ జయంతి నిర్వహించారు. ఈసందర్భంగా సావర్కర్ చిత్రపటానికి మాజీ ఎంపీపీలు వీర్ల నర్సింగరావు, దుర్గం రాజేశం పూలమాల వేసి నివాళి అర్పించి మాట్లాడారు. సావర్కర్ ఆశయసాధన కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ధర్మ జాగరణ కమిటీ సభ్యులు ఎడవెల్లి మహిపాల్‌రెడ్డి, నాయకులు పాపిరెడ్డి, పోచయ్య, రాములుగౌడ్, సాయిలుగౌడ్, భూపతిరెడ్డి, కిషన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, రమణారెడ్డి పలువురు పాల్గొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న వారికి దుర్శెట్టి మల్లేశం భగవద్గీత పుస్తకాలు అందజేశారు.

## చొక్కారావు ఆదర్శప్రాయుడు




చొక్కారావు చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

**కరీంనగర్ కార్పొరేషన్ :** మాజీ ఎంపీ, దివంగత జువ్వాడి చొక్కారావు ఆదర్శప్రాయుడని కాంగ్రెస్ నాయకులు కొనియాడారు. మంగళవారం చొక్కారావు వర్ధంతి సందర్భంగా డీసీసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ నిరాడంబర జీవితం గడిపి రాజకీయ నాయకులకు ఆదర్శంగా మారారన్నారు. విలువలతో కూడిన రాజకీయాలు పాటించిన నేత చొక్కారావు అని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, పురుమల్ల శ్రీనివాస్, ఆకారపు భాస్కర్‌రెడ్డి, ఎండీ.తాజొద్దిన్, పులి ఆంజనేయులుగౌడ్, కర్ర రాజశేఖర్, మాదాసు శ్రీనివాస్, వంగల విద్యాసాగర్, పొరండ్ల రమేష్, దీకొండ శేఖర్, నెల్లి నరేశ్, రజిత్‌రెడ్డి, జ్యోతి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

### షార్ట్‌సర్క్యూట్‌తో కాలిపోయిన వీధిదీపాలు

**కరీంనగర్ కార్పొరేషన్:** నగరంలోని వాల్మీకినగర్‌లో షార్ట్‌సర్క్యూట్‌తో నగరపాలక సంస్థకు చెందిన దాదాపు 40 వీధిదీపాలు కాలిపోయాయి. ఇటీవల వరుసగా ఈదురుగాలులు పెడుతున్న క్రమంలో రెండు లైన్‌లు ఒకదానికొకటి తగలడంతో కాలనీలోని దాదాపు 40 వీధి దీపాలు కాలిపోయినట్లు కాలనీవాసులు తెలిపారు. దీంతో రెండు, మూడు రోజులుగా వాల్మీకినగర్‌లో రోడ్లపై చీకటి ఆవరించిందన్నారు. కాగా ఈ ప్రాంతంలో తరచూ ఇదే సమస్య కొనసాగుతోందని, శాశ్వత పరిష్కారం చూపాలని వారు కోరుతున్నారు.



### ఘనంగా హనుమాన్ శోభాయాత్ర

**తిమ్మాపూర్:** మండలంలోని మహాత్మానగర్‌లో మంగళవారం రాత్రి హనుమాన్ శోభాయాత్ర ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమంలో హనుమాన్‌మాలధారణస్వాములు, భక్తులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు. ఈసందర్భంగా మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు.





### అమ్మకు ఎగ్జామ్.. బజ్జో బుజ్జాయి

రాష్ట్ర వ్యాప్తంగా ఆన్‌లైన్‌లో టెట్ పరీక్షలు నిర్వహిస్తున్నారు. తిమ్మాపూర్ మండలం రామకృష్ణకాలనీలోని వాగేశ్వరి కాలేజీలో టెట్ సెంటర్ ఏర్పాటు చేశారు. మంగళవారం మంచిర్యాల జిల్లాకు చెందిన షారుఖ్‌ఖాన్ భార్య పరీక్ష రాయడానికి సెంటర్‌లోకి వెళ్లగా నెలల వయసు ఉన్న పాపను కళాశాల ఆవరణలోని చెట్టుకు కట్టిన ఊయలలో బదుకోబెట్టి లాలించారు. మరోవైపు అమ్మ ఎగ్జామ్ రాయడానికి వెళ్లగా చిన్నారులు చెట్టుకింద ఆడుకుంటున్న దృశ్యాలను 'సాక్షి' తన కెమెరాలో క్లిక్ మనిపించింది. – తిమ్మాపూర్